
ఆంధ్రపత్రిక



విజయ సంవత్సరాది సంచిక. 1953-'54

SOVEREIGN - REMEDY

AMRUTANJAN

Best Indian Pain Balm

Amrutanjan Depot

Beware of Spurious Imitations.

శా॥ రంతుల్ మానుము కుక్కుటాధమ! దరిద్రక్షుద్రశూద్రాంగణ
ప్రాంతోలూఖల మూలతండుల కణగ్రాసంబుచేఁ గ్రొవ్వి; దు
ర్దాంతాభీల విశేషభీషణ ఫణాంతర్మాంస సంతోషిత
స్వాంతుండైన ఖగేంద్రుకట్టెదుర నీ జంజాటముల్ సాగునే!





చమ్రియా టాకీ డిస్ట్రిబ్యూటర్స్ వారు

తెలుగు సినిమా లోకమునకు ఉగాది అభినందనలతో
[illegible]పూర్వకముగా ప్రకటించు నూతన తెలుగు చిత్రములు

[illegible] వారి
అమ్మలక్కలు
[illegible]
దర్శకుడు..[illegible]

[illegible] వారి
ప్రొడక్షన్ నం 12
[illegible]
దర్శకుడు..[illegible]

[illegible] వారి
ఇనస్పెక్టర్
[illegible]
దర్శకుడు..[illegible]

[illegible] వారి
[illegible]
[illegible]
దర్శకుడు....[illegible]

పక్షిరాజా వారి
జానకి
[illegible]
దర్శకుడు..[illegible]

[illegible]
మరకతం
దర్శకుడు..S.M. శ్రీరాములునాయుడు

[illegible] వారి
మేలుకొలుపు
[illegible]
దర్శకుడు..ప్రకాశరావు

[illegible] వారి
ప్రొడక్షన్ నం 4
దర్శకుడు..ప్రకాశరావు

జెమినీ వారి
అవ్వయార్
[illegible]

ప్రొడక్షన్ నం 19
[illegible]

[illegible] వారి
?
[illegible]
దర్శకుడు..[illegible]

పాతేయ
[illegible]
దర్శకుడు..[illegible]

[illegible] వారి
[illegible] చిత్రము
దర్శకుడు..[illegible]

CHAMRIA TALKIE DISTRIBUTORS
[illegible]

రేడియో & ఎలెక్ట్రిక్స్ లిమిటెడ్

(హైదరాబాదు-దక్కన్ నందు స్థాపితము)

శ్రేష్ఠమైన
రేడియోలను,
విడిభాగాలను
అత్యధికముగ
స్టాకుచేయువారు

ముల్లార్డు
ఫిల్కో
బుష్
రేడియో
డీలర్లు



పీటర్‌పాన్
డ్రైబ్యాటరీ సెట్లు



పోర్టబుల్
ఉపయోగించుట
తేలిక
విద్యుచ్ఛక్తి లేకుండా
పనిచేయును

20 సంవత్సరాల అనుభవముతోను,
ఆధునిక సాధన సంపత్తితోను, స్టేటు మొత్తముపై
సమర్థతతో రేడియో రిపేర్లు చేయు సంస్థ





రేడియో బ్యాటరీల **EVEREADY** TRADE-MARK డిస్ట్రిబ్యూటర్లు :

మేనేజింగ్ ఏజెంట్లు :

కె. వరదరాజ్ & సన్సు

స్థాపితము 1938

హెడ్ ఆఫీసు :
69 - ఏ, కింగ్సు వే,
సికిందరాబాదు (దక్కన్).
ఫోను నెం. 7418.




బ్రాంచి ఆఫీసు :
అబిద్ రోడ్డు,
హైదరాబాదు (దక్కన్).
ఫోను నెం. 4256.

తంతి : "RADELEC"

మర్ఫీ రేడియో

శ్రోతలకు అపూర్వానంద మిచ్చునట్లు నిర్మింపబడినది



మాడల్ 196

ధరస్థమైనబల–ప్రశస్తమైన పలుకుబడి–నమ్మకముగ పనిచేయుట–మాడెల్ 196 ఈ మూడు ఉత్తమ గుణములకు ప్రసిద్ధమైనది.

ఆరువాల్వులు ఏసి, ఏసి/డిసి సూపర్ హెట్ బాండ్ స్ప్రెడ్ రిసీవర్

వెల: రు. 750


మర్ఫీ శ్రేణికి మకుటాయమానము

సొగసైన ఈ సెట్టు శ్రోతలకు విందు గొలుపును. రేడియో ఇంజనీరింగుకు, శబ్దగ్రహణ చాతురికి విజయరూపము. బహు సుందరమైన కాబినెట్‌లో అమర్చబడినది.

9 వాల్వులు ఏసి, ఏసి/డిసి

బాండ్ స్ప్రెడ్ సూపర్ హెట్ రిసీవరు. వాల్‌నట్‌తోను, శీతోష్ణములకు చెక్కు చెదరని ప్లైకమూర్తితోను తయారు చేయబడిన అందమైన కాబినెట్. పుష్‌బటన్ కంట్రోల్‌తో విశాలమై ప్రకాశవంతమైన స్కేలు.

ఇది ప్రపంచంలోకల్లా అత్యుత్తమమైన సెట్టుఅని దీని యజమాన్లు ఉద్ఘాటించుచున్నారు.



మాడల్ 160

వెల: రు. 1,190/-

murphy radio

సోల్ డిస్ట్రిబ్యూటర్లు:

అడిసన్ అండ్ కో. లిమిటెడ్,

మద్రాసు : బెంగుళూరు : కోయంబత్తూరు : వెల్లింగ్టన్

అధికారముపొందిన మర్ఫీడీలర్లు:

కృష్ణా, ఉభయ గోదావరి - మెస్సర్సు. జనరల్ ఏజన్సీస్ (సర్కార్సు) లిమిటెడ్, మెయిన్‌రోడ్డు, రాజమండ్రి.

గుంటూరు - మెస్సర్సు. రఘునాథ్ ట్రేడింగ్ కార్పొరేషన్, మెయిన్‌రోడ్డు, గుంటూరు.

విశాఖపట్నం - మెస్సర్సు. యూనివర్సల్ రేడియో అండ్ ఎలెక్ట్రికల్ కంపెనీ, విజయనగరం.


నెల్లూరు - మెస్సర్సు. జనరల్ రేడియో కంపెనీ, ట్రంకురోడ్డు, నెల్లూరు.



ఆంధ్రపత్రిక

(నలువది నాలుగవ
ఉగాది సంచిక)

(1953-54)




సంపాదకుడు:

శివలెంక శంభుప్రసాద్

*

[వెల రూ. 2]



చెన్నపురి:
ఆంధ్రపత్రికా ముద్రాలయమున
ముద్రితము.

ఆంధ్రపత్రిక

విజయ ఉగాది సంచిక

విషయానుక్రమణిక

ముఖచిత్రం—రాధాకృష్ణ

శ్రీమతి సరళా రామన్ (డెహ్రాడూన్)

చిత్రములు:

నచికేతు యముడు; చిత్రకారుడు: శ్రీ యస్. రాజం; కోణార్క-దేవాలయ కుడ్యశిల్పము-చిత్రకారుడు: శ్రీ గోవింద్. ప్రమథగణం - (భువనేశ్వర దేవాలయ కుడ్యశిల్ప ప్రతి చిత్రము: శ్రీ కె. వేణుగోపాల్.), "నటరాజు"- కీ. శే. శ్రీ అడివి బాపిరాజుగారు, జీవితభారం-చిత్రకారుడు శ్రీ ఎ. పైడిరాజు, మురళి: శ్రీ వేలూరి రాధాకృష్ణ, అర్ఫ్యూస్ - యూరిడిస్, చిత్రకారుడు జి. యఫ్. వాట్స్.

ADVERTISER'S INDEX


వస్తోంది!!
అజంతా...
వయారిభామ
దర్శకత్వం... పి.సుబ్బారావు
సంగీతం... రాజేశ్వరరావు
CH. S. PRASAD
డిస్ట్రిబ్యూటర్లు:
ఆంధ్ర : అజంతా ఫిలిమ్స్, విజయవాడ.
సీడెడ్ : వసంతా పిక్చర్స్, గుంటకల్.
నైజాం : సుందర్ పిక్చర్స్ సర్క్యూట్, సికిందరాబాద్.
మైసూర్ : విజయాటాకీ డిస్ట్రిబ్యూటర్స్.
ఇతర వివరాలకు:
అజంతా పిక్చర్స్ — మద్రాసు-20.



కోణార్క దేవాలయ నృత్యశిల్పము

నందన సంవత్సరము, ప్రపంచ చరిత్రపై సుదీర్ఘ ప్రభావముగల ఘట్టముల కాటపట్టయి గూడ, ప్రపంచ నౌకను, కాలప్రవాహమునని సుడిగుండములనుండి తప్పించి శాంతిపథముననే విజయవంతముగ నడిపించి, విజయాంకిత మొనర్చినది. సర్వశుభసూచక నామ యగు 'విజయ'కు సుస్వాగతము.

ద్వితీయ ప్రపంచ యుద్ధానంతము విశ్వ శాంతి సాధనలో ఏడేండ్లు గడిచినవి. ప్రాకృతికమైన ప్రతి జనితవిషయమును ఏడేండ్ల కొకసారి, పొరమార్పి, పునరుద్భవము కాగలదని లోకసామాన్యమగు నమ్మకము గలదు. ఈ ఏడేండ్లలో విశ్వశాంతిసాధన, మారు రూపమున, ప్రపంచ అగ్రరాజ్యముల మధ్య ముసుగులో గుద్దులాటగా గడిచినది. నందన వత్సరాంతమున, ఆ ముసుగు తొలగి, శాంతియో, సమరమో ప్రత్యక్షముగ తేలిపోవలెనన్న తుత్రసిలికి ప్రాతిపదిక లేర్పడినవి.

అమెరికాలో ట్రూమన్ ప్రభుత్వము, సామ దాన భేదోపాయముల మూడిటిపైననే, రష్యాతో సామరస్యమునకై ప్రయత్నించినది. కొరియా యుద్ధ విషయమున దండోపాయావలంబనములో సమితి రాజ్యములను కూడగట్టుకొని, సమితి పేరటనే చర్య జరిపించి, సంధి రాయబారములకు ప్రయత్నము లెడ తెగక సాగించుచునేవచ్చినది. అమెరికన్ అధ్యక్షుడు, సైనిక మనస్తత్వవేత్త యగుటతో అమెరికన్ విదేశాంగ రాజనీతి, సామాన్యపౌరదృష్టినుండి తొలగి వీరరస ప్రధానముగా రూపొందుచున్నది. దండోపాయమునకు వెనుదీయమన్న చర్యలకు ప్రాతిపదిక వైచుచు, కొరియాయుద్ధము, ఫార్మోజాలోని చాంగ్ సైన్యములకు, చైనా ప్రభుత్వమునకు మధ్య యుద్ధముగా విస్తరించుటకు క్రియారూపముగ ప్రేరేపించుచున్నది.

స్టాలిన్ మృతికి పూర్వమే అమెరికన్ రిపబ్లికన్ ప్రభుత్వము, ఈ విధాన మవలంబించినది. శాంతి భంగము గాకుండుటకు, స్టాలిన్ ప్రతిష్ఠయు, ప్రభావమును, ప్రత్యక్ష యుద్ధప్రారంభ విముఖత్వమును, చాలవరకు పనిచేసినవి. అతని మృతితో, ఏర్పడిన, రష్యన్ నూతన నియంతృత్వమే అంతరమున నడచునో, ప్రపంచశాంతి కెంత దోహద మగునో, భవిష్యత్తే నిర్ణయించవలసియున్నది. కాని స్టాలిన్ మృతితో, రష్యన్ నూత్నప్రభుత్వము, మహానాయకుని గోల్పోయిన నీరసముతో లొంగి వచ్చి శాంతి చేకూర్చునని కాని, లేక స్టాలిన్కున్న నిగ్రహము లేక, వెంటనే కలబడి, తమ బలప్రాబల్యము ముందోడిపోయి, తద్ద్వారా శీఘ్రముగా ప్రపంచశాంతి లభింపవచ్చునని గాని, అమెరికన్ ప్రభుత్వ మాశించిన అది అడియాస మాత్రమే కాగలదని స్పష్టమే. ఈ విపరీత స్థితిని మనసులో నుంచుకొనియే తక్కిన ప్రపంచ రాజ్యములన్నియూ, ముఖ్యముగ భారతదేశమువంటి తటస్థ రాజ్యములన్నియూ, అలజడిపడుచున్నవి. తాము సహాయము చేయు మిత్రరాజ్యములు ససైనికముగ తమప్రక్కనే నిలువవలెనన్న ఉబలాటమును గూడ అమెరికన్ రాజనీతిజ్ఞులు వెల్లడించుటతో, బ్రిటన్ మొదలైన దేశముల రాజకీయజ్ఞులలోకూడ అలజడి ప్రారంభమైనది.

తటస్థ రాజ్యములు, సైనిక బలముతో గాకపోయినను, నైతిక బలముతోనైన, ఏకకూటముగా తమ ప్రభావములను విస్తరించుకొని, ఇరుకక్షలుగా విడిపోయిన ఈ అగ్రరాజ్యముల రెండిటి మధ్య, సమరస

శక్తిగా నిలచి ప్రపంచ శాంతిని కాపాడవలె నన్న భావము, పండిట్ నెహ్రూ, బెవాన్ మొదలైన ప్రముఖులనీ యుద్యమప్రారంభమునకు ప్రేరేపించుచున్నది.

ఈజిప్టులో ప్రభుత్వము మార్పొకటి ఈ సంవత్సరమున గణనీయ విశేషము. అచటి రాచరికము నిస్సారమై, పరిపాలనావిధానమంతయు పాడరిపోనున్న సమయమున, సామాన్య సైనిక మాత్రుడగు జనరల్ నజీబ్ సైనిక విప్లవమును ప్రారంభించి ప్రభుత్వమును హస్తాదధీన మొనర్చుకొని, దేశక్షేమదృష్ట్యా సక్రమమైన నియంతస్థానమున నిల్చినాడు. దేశములో నిర్దుష్ట పరిపాలనాయంత్రస్థాపనకును, అభ్యుదయకరములగు భూసంస్కరణ విధానాలంబనములకును నజీబ్ ప్రాముఖ్య మిచ్చుటలో, ఈజిప్టు రాజ్యాంగము కొంత సుస్థిరత చేకూర్చుకొనుచున్నది. నేటి ఈజిప్టులో వ్యవహరించుటలో నూతనమార్గ మవలంబించుట బ్రిటనుకు కూడ అవసర మగుచున్నది.

భారతదేశము తన విదేశాంగనీతి వలనను, దేశ పునరుద్ధరణ కార్యకలాపములవలనను, దేశ విస్తృతముగ శాంతిస్థాపనా సామర్థ్యమువలనను ఇతోధికముగ ప్రపంచరాజ్యముల గౌరవ మందుకొనుచు శక్తివంతముగా వ్యవహరించుకొనగల్గుచున్నది. ఆముందు సంవత్సరమున, ప్రపంచమున ఇంతకుముందు కని విని యెరుగనంత విస్తృత పరిమాణములో, ప్రజాస్వామ్యసూత్రబద్ధమయి, ప్రశాంతముగ ఎన్నికలను జరిపించుటలోనే, భారత ప్రభుత్వ పరిపాలనాసామర్థ్యము, ప్రజాస్వామ్య దేశము లన్నిటికి అచ్చెరువు గొల్పినది. ఆతర్వాత, రాజ్యాంగబద్ధముగ శ్రేయోరాజ్యాదర్శములో ప్రజాస్వామ్య పద్ధతిని పంచవర్ష ప్రణాళిక నుపక్రమించుటలో భారతదేశము ప్రపంచ అభ్యుదయకాముకుల మన్నన లందుకొన్నది.

ఈ ప్రణాళికను విజయవంతముగ నిర్వహించుటకు, ప్రభుత్వము మిశ్రమ ఆర్థికవిధానముల పైనను, ప్రజల సహకారకృషిపైనను ఎక్కువగ ఆధారపడినది నందన సంవత్సరమున ప్రారంభమైన ప్రణాళికాంతర్భాగముగు కమ్యూనిటీ ప్రాజెక్టులకు ప్రజాసహకారము విరివిగ లబ్ధమైనది. ప్రణాళిక కృషి పెద్ద ప్రాజెక్టుల విషయములో రెండేండ్ల క్రిందటనే ప్రారంభమైనది. స్వల్పముగ ఫలసాయముకూడ విజయ సంవత్సరముననే కొంత లభింపవచ్చును. వ్యవసాయ సంస్కరణము, అధికాహారోత్పత్తి, నూతన పారిశ్రామికాభివృద్ధి, సంఘసేవాకార్యక్రమము లాదిగా గలవన్నియు, విజయ మొదలు మూడుసంవత్సరములలోనే తీవ్రముగ జరుగవలసియున్నవి. ఈ ప్రణాళికలకైన వ్యయమును స్వదేశమునను విదేశమునను కూడ విజయవంతముగ సేకరించగల ధైర్యము ప్రభుత్వమునకు చేకూరినది. దేశప్రజ యావన్మందియు యథాశక్తిగ సహకరించిన ప్రణాళికను విజయవంతముగ నెరవేర్చగలమనే ప్రభుత్వము విశ్వసించుచున్నది. ఈ ప్రణాళికను విజయవంతముగ నిర్వహించుటకు కేంద్రమున, రాష్ట్రములలో కూడ, ఒకే పక్ష ప్రభుత్వముల ప్రాబల్యము, సుస్థిరత్వము, దాదాపు ప్రణాళికపట్ల తక్కిన అన్ని పక్షముల ఆమోదమును గూడ, విజయలబ్ధికే సూచకములుగ నున్నవి.

నందన సంవత్సర మాంధ్రరాష్ట్రయవతరణకు నాందీప్రస్తావనమంతయు పరిపూర్ణముగ పూర్తి చేసికొనినది. ఆంధ్రరాష్ట్ర సాక్షాత్కారణభాగ్యము విజయ సంవత్సరమున కొనగూడక తప్పదు. ఆంధ్రప్రజకు "విజయ" సార్థకాభిధాన కాగలదు.


భాషా రాష్ట్రముగ ఆంధ్రరాష్ట్రమును ఆంధ్రులు కోరిరి. ఆ సిద్ధితో స్వకీయ వ్యవహారములందాంధ్రభాషకు ఇతోధికమైన ప్రాముఖ్యము లభించవలసియున్నది.

ఆంధ్రభాష యొకప్పుడు పరిపాలక భాషగా విరాజిల్లినది. పర ప్రభుత్వముల రాకతో, పరిపాలనకనువైన భాషాపదము లెన్నియో వ్యవహారమున అంతరించిపోయినవి. నేడు, మరల ఆ భాషకంతకు

పునరుజ్జీవము చేకూరవలసియున్నది. కేవలము పార పదములనియే కాదు. ఆంగ్లభాషాభావముల ప్రాతిపదికతో నెలకొల్పబడి, సాంఘిక, అంతర్భాగములుగ స్థిరత్వ మందుకొనిన అనేక నవీన విషయములకు, శాస్త్రములలో, వ్యాపారములలో, వ్యవహారములో, పరిపాలనలో, విద్యలలో, కళలలో, సర్వ సాంఘిక సాంస్కృతిక వ్యవస్థలలో దేశీయమైపోయిన అనేక విషయములకు, ఆంధ్రభాషలో ప్రాతిపదిక పదజాలము స్థిరముగా రూపందుకొనవలసి యున్నది. ఈ ప్రయత్నమున కృషి, ప్రభుత్వపరముగానూ, ప్రజాపరముగానూ కూడ జరుగవలసియున్నది. శాసన సభలు, విశ్వవిద్యాలయము, న్యాయస్థానములు మొదలగు అధికార సంస్థలు తెలుగున వ్యవహరింప బూనుకొనవలసి యున్నది. ఈ వ్యవహారము సులభమగుటకు, పండితులు, శాస్త్రజ్ఞులు, సాహితీపరులు, సర్వులునూ సమిష్టిగా దీర్ఘకృషి చేయవలసిన అవసర మెంతేని యున్నది. ఈ సహకారము నంతను ప్రోత్సహించి రాబట్టగల బాధ్యత రాబోవు ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వముపై నున్నది.

నూతన సంవత్సరము సర్వవిధముల శుభదాయకము కాగలదని ప్రతి సంవత్సరారంభమున యాసింతుము. నందన సంవత్సర మీ యాసల నడియాసలొనర్పక ప్రపంచమును శాంతముగ నడపుకురాగల్గినది. విజయసంవత్సర మిలోధికముగ అభ్యుదయప్రదమై, శుభప్రదమగుగాత యని ఆశించుచున్నాము.

సర్వేజనా స్సుఖినో భవంతు.



దీపమాలిక



శ్రీ పి. గణపతిశాస్త్రి

నిను దలపోయునంతన కనీనికలం దరళాశ్రు పల్లవ
ల్లన దిగజారి, కన్గొలుకులం బ్రవహించి మహేంద్ర చాప మో
హానతర వార్ష నీలఘనమై బరువైన యెదంద రమ్యన
ర్తన కవితావిచిత్ర జలధారల నుర్వుల బర్వు లెత్తెడిన్

అసిధారాధివణుల్ మహాగహన వేదాంతాధ్వనీనుల్ శుభా
హాసిత ప్రస్ఫురితా! ఒకింత కనలే దమ్మా! భవన్మూర్తి! నే
నిసుకన్ మక్కువ నాటలాడు శిశు వెంతే దవ్వునం దల్లి నన్
న్నావ లిట్టేగురుతించు లీల నిను గ న్గొంటిన్ నిమేషమ్మునన్!

నీ శివరూప దీపమువనిం బడద్రోసి యహం కృతి జ్వరా
వేశ వశీకృతుల్ హృదయ పీఠములం దిడు కొంద్రు దూరదూ
రాశల బెళ్కులీను వికృతాశయ మృణ్మయ మూర్తు; లైన గా
నీ, శిశుఖేలనమ్మని హసింతువు! నాజననీ! కృపాఖనీ!

చదువుల్ సంధ్య లొకింత లేక చెడి దుస్సాంగత్యముల్ సేసి న
మ్మది గీలించిన యల్గులైన సుతులే మాతృప్రభూతాదరా
స్పదులై ఖించెదరందు రమ్మయి కళాంశమ్మైన నా తల్లి! నీ
హృదయమ్మెంత కరంగు నన్నమతి గాంక్షింతున్ యథేచ్ఛాగతుల్

ఏచిర జన్మ పుణ్యఫల మిమ్మెయి నిమ్మగ బండెనో గద
మ్మా! చరణాంకితమ్ము హృదయమ్ములరెన్ లసదిందు జాహ్నవీ
వీచికమై, తదీయసిత ఫేననలీల విలోల కుందమా
లాచల డోలమై కలకలస్వన మందగళన్మరాళమై!

నీమణి పాదుకారుణ ఘృణి స్ఫురణ మ్మెద రత్నదీప శో
భామహనీయ భాగ్యమొదవం గరుణించినదంచు నాతలం
పే మరి తావకార్చన మహీ మసృణాగరు ధూపమాలగా,
మామక దేహ మాభరణ మంగళపీఠికగా సమర్చెదన్

శీతలపోతజీవతరణీగతికై పవమానపూర్ణ, మా
శాతరళమ్ము పైడి తెరచాపవలెన్ నిరతమ్ము దాంతితో
డై తనియింప, నిత్యభయదారవ సంకుల జీవితాబ్ధి వీ
చీతతులే తమంత దరి చేర్పగ నే బయనింతు హేలగన్!



శకుంతల



వల్లపల్లి దుర్గాప్రసాదరాయకవి *

అల్ల విపినవీథిఁ గొంత దవ్వరిగి యంత
ముందరకుఁ బోవ నవ్విరి బోటి యడుగు
లాడక వెనుకకుఁ దిరిగి చూడఁ జిలుక
చుట్టి మూఁగి పుల్గులు పొదచూప వెఱచి.

"అమ్మక చెల్లె లేనుగను - లార గనుంగొనుచుండ నివ్విహం
గమ్ములు చుట్టునుం గవిసి - గాసి యొనర్చెడి మత్స్యశాకలా
దమ్మ" నటంచు నాశిశువు - పాలికిఁ జెచ్చెరఁ బాఱివచ్చి తే
దమ్మున నవ్విహంగముల - దంబకమున్ వెస బాఱఁదోలుచున్.

గ్రక్కున నక్కుమారితఁ గరద్వితయంబున నెత్తి ప్రేమతో
నక్కునఁ జేర్చి దాని రుచిరాంగము నాపద మస్తకంబునున్
జక్కఁగఁ జేతిచూచి మునిశక్తి మొయింబొలిపోవ కున్కికిన్
మిక్కిలి సంతసించి యనిమేష మధుప్రతవేణి యిట్లనున్.

"పక్షివరేణ్యములారా
యక్షీణ కృపాకటాక్షములరఁగ నిట మీ
పక్షంబుల మఱుఁగున నిడి
రక్షించితి నాయపత్య రత్నము నెమ్మిన్.

అళులార యీకూన యాఁకొని యేడ్చుచో మధువులానఁగనిచ్చి మనుపఁగదరె
తరులార యీపాప దగఁ గోరినఁగఁ జిన ఫలరసంబుల దప్పి వాపఁగదరె
పొదలార యీకందు ప్రొద్దువేఁడిమి సోకి కందకుండఁ జివుళ్లఁ గప్పఁగదరె
శిలలార యీపట్టి చలికి వానకు దయ్యకుంట మీమఱుఁగున నునుపఁగదరె

మెకములార యీచిఱుతను మ్రింగకుండ
జాలిఁ గనికరించి తొలఁగి చనఁగఁగదరె"
యనుచుఁ గన్నమోహమున నయ్యడవి యున్న
భూతకోటుల కెల్లను మ్రొక్కుకొనుచు.

---

*ఈ మహాకవి 1867 లో జన్మించి 1906 వరకు జీవించెను. జన్మస్థలము, అంబరుపేట. ఆర్వేల నియోగులు. శ్రీవత్స గోత్రులు. కౌశిపరిషద్, వైయాకరణ పండితులై శిష్య బృందములను వెలయించుకొన్న లక్ష్మీపతి 'శాస్త్రి' గారియనతండ్రి. వృత్తిరీత్యా బళ్లారి, కృష్ణా మండలములలో మేజస్ట్రీటు ఆఫీసు ఉద్యోగములలో ఈకవి జీవితము గడిచినది. ఈయన "నిర్వచన భారతాభ్యుదయ"మను, దాదాపు 2000 పద్యములు గల ప్రబంధమును రచించిరి. అది ఈనాటికీ అముద్రితముగానే వారి కుమారులయింట మిగిలిపోయినది. ఆ గ్రంథమునుండి, "శకుంతల"యను శీర్షికతో నై పద్యములను వారి కుమారుల యనుమతితో నిట ప్రచురించుచున్నాము.—సం.

ఆకలిగూరి యత్తతి ప్రియాత్మజ యేడ్వఁగ స్తన్యమిచ్చి యా
సైకత మేదినీస్థలిని చల్లని యాకులనీడ గల్గుపెన్
మ్రాకులక్రేవ నాచియుతఁ గ్రమ్మఱఁ జేరిచి కొంతసేపటన్
వ్యాకుల మందుచున్ నిలిచి యశ్రులు గన్నులఁ గ్రమ్మదేరఁగన్.

“అమ్మా ముద్దులపట్టి నిన్నిటఁ బృథివ్యాపోగ్ని వాతాంతరి
క్షమ్ముల్ దిక్కులు దిక్పతుల్ రవియునున్ జంద్రుండుఁ దారావితా
నమ్ముల్ బ్రహ్మయు విష్ణువీశ్వరుఁడు నానాసంయమి శ్రేష్ఠు లే
వమ్ముల్ వాటిలకుండ నెప్పుడనుకంపాస్ఫూర్తి రక్షించెడిన్.”

అని దీవించుచు నన్నిలింప తనుమధ్యాతల్లజం బాత్మజన్
వనమధ్యంబున నొంటిమై నునిచిపోవంగాఁ శకుంతంబులున్
జని తాపత్యనితాంతమోహ భరితస్వాంతంబులై యాత్మప
క్షనికాయంబులఁ గప్పిదాని నచటన్ గాపాడఁగాఁ జొచ్చినన్.

సమిధల్ పువ్వులు సంగ్రహింపఁదగ శిష్యశ్రేణితోఁ గణ్వ సం
యమిచంద్రుం డరుదెంచి కాంచె ఖగవ్యాసికముల్ గొల్వఁగా
రమణీయంబగు మాలినీతటమునన్ రాకేందుబింబాకృతిన్
సముదీర్ణద్యుతిఁ గ్రాలు నాశిశువు నాశ్చర్యంబు సంధిల్లఁగన్.

ఆలోకించి నిజాశ్రమంబునకు గన్యారత్నమున్ మౌని శా
ర్దూలుం డల్లనఁ దోడితెచ్చి లతికాందోళీస్థలిన్ బ్రోల్లస
న్నాళీకచ్ఛదపుంజ కల్పితకనత్తల్పంబునన్ నిల్ప న
బ్బాలారత్నము జూడవచ్చి రెలమిన్ వాచంయమాబ్జేక్షణల్.

చనుదెంచి మునిపురంధ్రీ
జన మబ్బాలిక యపూర్వ సౌందర్యంబున్
గని సంభ్రమమారఁగదీ
వన లొసఁగుచు వెస మహోత్సవము గావింపన్.

ఆ ముద్దులబిడ్డను గా
రామార శకుంతవితతి రక్షించుటచే
నా ముని ముఖ్యుఁడు దానికి
బ్రేమ శకుంతల యనంగఁ బేరొనరించెన్.

ఇట్లు పుత్రికి గణ్వమునీంద్రు డాఖ్య
సలిపి సమధికాపత్య వాత్సల్యమునను
దివ్య మకరంద నిజహోమధేనుదుగ్ధ
మధుర ఫలరసాధికముల మనుచుచుండు.

అకళంక చంద్రరేఖాకృతి నిరతర ప్రవర్ధమానమ్మగుచు వపువు నెగడ
గురుతర కనకాబ్జ కుట్మలంబుల మాడ్కి నురమున వక్షోజయుగళి మమత
దివ్యకందర్పాస్త్రదీధితుల్ పురణించు రుచిర దృఙ్మాలికా రుచులు దనర
తరగలపై నల్లత్రాచు నైవడి వళీయుతరోమరాజి చెన్నొంది మెరయు

భ్రమర పరివేష్టితోత్ఫుల్ల కమలలీల
చికుర విభ్రాజితాస్యంబు చెలువుమీఱ
పులినతలలీలఁ గటియు విపులత జెంద
శిశువు నవయౌవనోదయ శ్రీవహించె.

ఇటుల వయోవిభూతి వహియించి తపోధను నాశ్రమంబునన్
విటపిలతా నికుంజములవీధుల నిచ్చల మేయవచ్చు బల్
చిటిపొటి కూనలన్ గలుగు జింకలతోడ వినోదలీల న
క్కుటిల వినీలకుంతల శకుంతల శైశవకేళిఁ దేలుచున్.

పూదీవ బాదలకుఁ బాదులు కావించి పాలుపారఁ బన్నీట ప్రోదిసేయు
మిసిమిగ్రొం బసిరిక మెసవగా మరుపుచు హోమధేనువు ప్రేపు ప్రేమ మనుచు
పిననాడు పెనిచిన పేర్మిఁజూడఁగ వచ్చు పులుగుపిండులతోడఁ బ్రొద్దుపుచ్చు
చిన్నారి జడదారి చిన్నలాడులఁగూడి క్రొత్తావి పూదోటఁ గోష్ఠిసలుపు

నోము సల్పెదనని మునిగీమునెల్ల
వేడ్కఁ గ్రాసేయు నెత్తావి విరులసరుల
ననుదినంబును మునిపల్లె కరుగుదేరు
నతిథి నభ్యాగతులనరసి యాదరించు.

"జననీస్తన్యము లాన నోమక యజస్రంబున్ భవద్దుగ్ధపా
ద నిరూఢిం బ్రతుకంగ దోఁపుకతనన్ నైజంబుగా నీపయిన్
జననీ భావ మెలర్చు నాకు" ననుచుం జంద్రాస్యప్రస్ఫీతమా
నను రాగంబున హోమధేనువునుఁ గంఠాశ్లేషమున్ జేయుచున్.

అంతే వాసులకున్ ముని
చింతారత్నంబు దెలియఁ జెప్పెడినెడ వి
స్నంత సకల ధర్మములు శ
కుంతలయుఁ గ్రహించు బుద్ధికుశలత మెచ్చన్.

పద్యరచన - శిష్ట వ్యావహారికభాష



శ్రీ కోట సుందరరామశర్మ

పదిహేనేండ్ల క్రితం ఒకమాటు ఒకమాట అన్నారు గురువులు శ్రీ గిడుగువారు. ఒకనాటి సందెచీకటి వేళ (లో వెలుగున్న వారికి వెలి వెలుగేలా?) "గద్యరచనకు శిష్టవ్యావహారిక భాష వాడండి, పద్యరచనకు ఏభాష వాడాలి అనే ప్రశ్నజోలికి మనం పోవద్దు" అని. అప్పటినుంచీ నా మనస్సులో ఒక సమస్య ఏర్పడింది. అస్మత్తుల్యులు ఇంకా ఎందరో ఉంటారనే భావిస్తాను ఈ సమస్య విషయంలో.

పైన ఉటంకించిన గిడుగువారి మాటల్లోనే ధ్వనితమవుతుంది సమస్య ఏమిటో. పద్యాల్లో ఏదో గ్రాంథికమనే భాషనే వాడనివ్వండి, శిష్టవ్యావహారిక భాషను అందులోనూ వాడాలని తంటాలుపడి మనం ఇంకా పేచీపడవద్దు అని వారి అభిప్రాయం. "పద్యరచనలలో ఉన్నది నూటికి నూరుపాళ్ళా గ్రాంథికము కాదు" అని వారికి తెలియక కాదు వారా ముక్క అన్నది. శిష్టులు గద్యంలో వ్యవహరిస్తారు; కాబట్టి శిష్టవ్యావహారికం గద్యానికి అన్వయిద్దాం అనివారి అంతర్యం అయినట్లు నేనూహించాను. ఆ విధంగా ప్రస్తుతం తెలుగు రచనలనుచూస్తే గద్యం శిష్ట వ్యావహారిక భాషలోనూ, పద్యం గ్రాంథిక మనే భాషలోనూ ప్రచురంగా నడుస్తూ ఉండడం మనకు గోచరిస్తోంది. ఇట్టి విచిత్రపద్ధతి ప్రపంచంలో మరే భాషలో నయినా ఉందా అని విచారిస్తే లేనట్లు చెప్తున్నారు పెద్దలు. మనం బాగా ఎరుగున్న ఇంగ్లీషు భాషలోని గద్యపద్యముల భాష ఒక్కటే. ఛందస్సు కోసరమని అన్వయ క్రమం (*Prose order*) లో మార్పు లుండవచ్చు; అక్కడక్కడ పాతమాటలు పడవచ్చు. *Said* (చెప్పెను) అనే మాట బదులు *Quoth* అనేది, ఇట్టివే మరికొన్ని చిన్నప్పుడు మనలో కొంతమంది చదువుకొన్నాము. "వెండియు" పదాన్ని "మఱియు" అనే అర్థంలో అవసరం పడితే పద్యాల్లో అంతా వాడుతున్నాం. అంతే కాని గద్యభాషకూ పద్యభాషకూ ఇంత తేడా ఇంకెక్కడా కనపడదు.

ఈ సందర్భంలో కొంచెం వెనక్కి వెళ్ళిచూద్దాం. "ప్రాచీన కాలంనుంచీ గ్రాంథికతా ముద్ర పడడానికి వీలుకాని పదాలూ, పద సముదాయాలూ ఎన్నెన్ని పద్యకావ్యాల్లో అగుపించడం లేదా?" అనే ఊహ కలుగకపోదు ఎవ్వరికైనా? కవిబ్రహ్మ తిక్కనే "చావము నా కందిమ్మ" అన్నాడు. శబ్దపల్లవమని దీన్ని వైయాకరణులు సమర్థింతురు గాక. "అనవల సంటె" నన్నాడు మధ్య కాలానికి చెందిన చేమకూర వెంకటకవి. అధునిక కవులలో లబ్ధప్రతిష్ఠులు కీ॥ శే॥ కొడాలివారి "హంపీ క్షేత్రం" లో "కంటి నీరిగిరి పోయిం దంతరాగ్నిచ్ఛటల్" ఇది మచ్చుకు ప్రబంధపద్ధతిని నడిచిన పద్యకావ్యాలలోని ఉదాహరణాలు. ఇక ప్రాచీన కాలం నుంచీ చాటువులలో శిష్టవ్యావహారిక ప్రయోగాలు లెక్కలేనన్ని. శ్రీనాథు డంతటివాడే "చిల్లరదేవుళ్ళు" అన్నాడు. "చల్లాయంబలి" ద్రావినాడు. ధూర్జటి శతకంలో ధవలతల్ "కోసీ కోయ" ని మనః ప్రవృత్తికి పశ్చాత్తపించినాడు. ఇటీవలి కాలంలో హాస్యానికి వ్రాసిన చాటువులలో "విస్సాయి వస్సాడకే" అనే ఛాందసుల పలుకుబడికి ఉదాహరణమున్నా, గాడ్దె "విసు లూదుతాడు," రైలు "లగెత్తుతాది" "దాని తోకలో మణుసులు కూకుటారు" (పూర్తిపద్యం జ్ఞాపకం లేదు — అనే అశిష్ట జనోక్తి మొదలయినవాటికి ఉదాహరణలు లభిస్తాయి. అయితే ఇది శిష్టవ్యావహారిక మనిపించుకోదు. సభాముఖాన ఇట్టివి ఛాందస ప్రయోగములనీ, గ్రామ్య ప్రయోగములనీ అనిపించుకొంటాయి గదా! "అభిరాది గిరః గ్రామ్యం" అనే దండ్యాచార్యుని పాదమునే చదువుతూ ఉండేవారు గిడుగువారు. ఇట్టి చాటుపద్య ప్రయోగములమాట అటుంచి ప్రాచీన కావ్యప్రయోగాలకు సయితం "బాల కవిశరణ్యం" నిజంగా బాల కవిశరణ్యం. గురుబ్రహ్మలు చెళ్ళపిళ్ళవారు ఎన్నో ప్రయోగాలు వ్యాకరణ సిద్ధాలు (ఏ వ్యాకరణమనీ, వ్యాకరణమంటే ఏమిటే అని ప్రశ్నలు పుట్టడం ఎప్పటికప్పుడు సహజమే) కాని వాటిని గుప్పేస్తూ ఉండేవారు, సంభాషణలో నేమి, ఉపన్యాస వేదికలమీదనేమి, ప్రథమాచార్యులకు కాని ప్రయోగాలకు ద్వితీయాచార్యులు గతి కల్పించారు. ప్రథముడు సూరి కుదర్చనివానికి ద్వితీయుడు 'ఆచార్యులు' సూత్రాలు చేశారు. ఇంకా కుదరని 'కొబ్బరాకు' లకు, 'మామిడాకు' లకు తర్వాతి వారు సూత్రాలు వ్రాశారు. ఇంతకూ చెప్పవచ్చే దేమిటంటే వ్యాకరణం అనుశాసన మనే సంగతి మరువ రాదనీ, "లోకం వృద్ధ్యా" అను భాష్యోక్తిని సర్వదాస్మరించవలెననీ; ఇటు వంటప్పుడు "వింటే" "కంటే" తప్పులేనిది "చేస్తే" తప్పని చెప్పవలసిన విచిత్రత ఏర్పడ్డది తెలుగుభాషలో.

తరువాత గేయ కవిత్వంవంక చూద్దాం. కీర్తనలు, పదాలు, పాటలు ఎన్నో లక్షలు. "ఉండేది రాముడొకడు" త్యాగయ్యకు. "పరికిణీ తొక్కాడు పదియేండ్ల కన్నెలా" కిన్నెరసాని "కదిలింది" "కాల్వలై పారింది" ఇవి అశిష్టములా? ఇందు కవిత్వము లేదా? కీ॥ శే॥ చిలుకూరి వారి మాటగా చెప్పవలసివస్తే ఇవి ఛందోబద్ధములైన పద్యపంక్తులు కావా?

పైన చెప్పిన అయా ఉదాహరణలు వ్యావహారిక భాష కావ్య పద్యములలో కూడా చొచ్చుకొని పోవడానికి ప్రయత్నించిందనీ కాని ఏదో ఒక తంథాన నడవాలనే ప్రవృత్తి ఏర్పడి

పోవడంవల్ల కవులు శిష్టవ్యావహారిక భాషను పద్యరచనలోనికి విరివిగా చొప్పించలేదనీ తోస్తోంది. శిష్టవ్యావహారిక భాషలో ఉండే స్వాభావికతను గుర్తించి కొందరు 'ముందడుగు' కవులు దానికి ఎంత దగ్గరగా వచ్చేభాష వ్రాశారో చూడండి — ఉదాహరణానికి.—

"ఆతని కేమివచ్చినది అంతయు తీరినవెన్క రాజ్యముక్
చేతునటన్న ఆస; మతి చెడ్డదిపో, యువరాజు చావగా
నే తన కబ్బునా పదవి? నేటికి పాపము పండిపోయెను
య్యా తనవంటివాని కిదియా తగుబుద్ధి వినాశకాలమే॥

బాపురమయ్య............" (కొడాలివారి హంపీక్షేత్రం.) ఇట్టివి ఎన్నో ఉదహరించవచ్చు.

ఈమధ్య నావద్దకు ఒక చిన్న తర్జుమాపని వచ్చింది. హిందీలో సూరదాసు అనే ఒక భక్తకవి భాగవతం అంతా పదాల్లో వ్రాశాడు. దశమస్కంధానికే ఎక్కువ ప్రాధాన్యం. ముఖ్యంగా శ్రీకృష్ణుని బాలక్రీడలూ, గోపికల విప్రలంభశృంగారమూ ఇతడు అధికంగా వర్ణించాడు. అందులోని ఒక పదం, ఇందులోంచి ఒక పదం తర్జుమా చేయవలసిందని ఒక సంస్థవారు నన్ను కోరారు. బాలక్రీడలకు సంబంధించిన పదమిది.

మూలం :—

మైయా, మోహి దాఊ బహుత్ ఖిఝాయో । మోసోఁ కహత మోల్ కో లీనో తోహి జసుమతి కబ్ జాయో । కహా కరౌఁ, ఇహి రిస కే మారే ఖేలన హౌఁ నహిఁ జాతు । పుని పుని కహత కౌన హై మాతా కో హై తుమరో తాతు । గోరే నంద జసోదా గోరే తుము కత స్యామ సరీర్ । చుటకీ దై దై హఁసత గ్వాల సబ్ సిఖై దేత బలవీర్ । తూ మోహీ కో మారన సీఖీ దాఊహిఁ కబహుఁ న ఖీఝైఁ । మోహన్ కో ముఖ రిస సమేత లఖి జసుమతి సుని సుని రీఝై । 'సూర' స్యామ మోహి గోధన కీ సౌఁ, హౌఁ మాతా, తూ పూత్ ॥

ఇందులోని భాష గ్రాంథికమువునా కాదో అని ఒక సందేహము చదువరులకు కలుగవచ్చు. మామూలుగా నేను పత్రికల్లో కనబడే, రేడియో మున్నగు వాటిద్వారా వినబడే హిందీ కాదిది అనే సంగతి స్పష్టమే. ఆ కాలంలో చాలమంది కవులు ముఖ్యంగా సంగీతానికి అనుకూలంగా పదాలు రచించినప్పుడు "వ్రజభాష"ను ఉపయోగించేవారు. వ్రజభాష అంటే శ్రీకృష్ణుడు సంచరించిన ప్రదేశపల్లెగల మండలములోని హిందీయొక్క ఒక మాండలిక భాష. ఏ భాషలో నయినా పదసాహిత్యమునకూ గేయకవిత్వానికీ శిష్టవ్యావహారిక భాషనే వాడుతారు కవులూ, పదకర్తలూ సంగీతం అట్టిభాషనే కోరుతుంది గనుక. అందుకనే త్యాగరాజాది గాయకులూ పాటలువ్రాసిన అడివి, నండూరి, విశ్వనాథ కవికొండలాదులూ శిష్టుల వాడుకభాషనే వాడారు.

ఇందుచేత తర్జుమా పని మొదలుపెట్టేముందు నాకు ఒక ప్రశ్న పుట్టింది. తర్జుమా పద్యాల్లోకి చెయ్యండి వీలుంటే అన్నారు వాళ్ళు. సూరదాసు ప్రతిపిల్లవాడికీ అర్థమయ్యేటట్లు, పిల్లలు సహజధోరణిలో అన్నట్లు తన రచన చేశాడు. దాని తర్జుమా పదాలుగాగాని, పద్యాల్లోకిగాని చెయ్యవచ్చుననిపించింది. పద్యాలుగా మారుద్దామనుకొన్న నాకు శిష్టవ్యావహారికభాషను వాడితే బాగుంటుందనిపించింది. భాషాసహజత్వం మూలగతమైన సహజత్వానికి అనుగుణంగా ఉండ వీలవుతుందని. శిష్టవ్యావహారిక భాషలోనే పద్యాలు అనుకొంటూ వ్రాసుకు వెళ్ళాను — ఏమీ కష్టం కనపడలేదు. క్రొత్తమార్గంకనుక వింతవింతగా కనుపించింది. పై పదానికి నేను వ్రాసిన కందాలు.

1. "అమ్మా ఏడ్పించాడే
ఇమ్మాటలు పలికి అన్న 'ఎప్పుడురాని
న్నమ్మ యశోద కనిందట
అమ్మేరస లెవరో నిన్ను' అని అంటాడే.

2. ఇందుకు కోపం రాదా ?
అందరితో కలిసి ఇంక ఆటకుపోనే
'నందయ్య తెలుపు, అమ్మయు ;
ఎందుకురా నీవు నల్ల'నిట్లంటూంటే.

3. పకపక నవ్వేరమ్మా
ఒకరొకరు చిటికవేసి ఊరక గొల్లల్
'పికిరీలు' చేయుడంటూ
ఇక అన్నే వాళ్ళకెల్ల ఎగదోశాడే.

4. నన్నే ఎప్పుడు కొడతా
వన్నంటే నీకు ఇష్టమాకాదో' యను నా
విన్నని కోపపుఁ బలుకులు
విన్నదియై నవ్వుకొనుచు ప్రీతయిటులనున్.

5. "కన్నా, వినరా, బలరా
మన్న మొదటినుంచి వట్టి అల్లరివాడే
నాన్నా, ఈ ఆవులతో
డన్నా, నేనమ్మ నువ్వు అసలుకొడుకువూ"

ఇది ఈవిధంగా వచ్చింది. నాల్గవ కందం ఉత్తరార్థం గ్రాంధికభాషలో వ్రాశాను. అక్కడ ధ్వనికారాదులు చెప్పిన "కవ్యుక్తి" "కవికల్పితపాత్రోక్తి" అనేమాటలు అన్వయిస్తే ఎలా ఉంటుందో అనిపించింది. వచనంలో ఇట్టిపద్ధతి ఆధునికకాలంలో క్వాచిత్కంగా గోచరిస్తానే ఉంది. ఉదాహరణకు శ్రీ కాటూరి వేంకటేశ్వరరావుగారి "ముగ్గురు మూర్తులు" అనే ఆంధ్రీకృత నవలలో సంభాషణలు శిష్టవ్యావహారికంలోనూ, కథాకథనమూ, వర్ణనలూ 'గ్రాంధికతా' ముద్ర గల భాషలోనూ ఉన్నాయి. ఇదొక క్రొత్త కలగలుపు. విశ్వవిద్యాలయము లీ గ్రంథమును పాఠ్యగ్రంథంగాకూడ నిర్ణయించినాయి. కాబట్టి పద్యాల్లోకూడా సంభాషణాదులు అంటే కవికల్పితపాత్రోక్తులు శిష్టవ్యావహారికంలో ఎందుకు పెట్టకూడదు అన్న నా ఆలోచనాపూర్వక ప్రయత్నాన్ని లోకానికి చెప్పుదామనిపించింది. అదే ఈ వ్రాత. యతిప్రాసలు తెలుగు కవిత్వానికి సహజాలంకారాలూ, శబ్దసాధుత్వ సాధుత్వ విషయనిర్ణయోపకారములూను. శిష్టవ్యావహారిక భాష వీనికిగాని, ఇవి ఆభాషకుగాని భంగకరములు కావక్కఱలేదు — అలవాటులేదు కాబట్టి వింతగా కనపడవచ్చు—

ఆపైన మరొక్క విషయం కూడ బుద్ధి కేసింది. పై చెప్పిన పద్యాల్ని 'గ్రాంథికం' లోకి మార్చగలమా అనిపించింది. వచన విషయంలో వలెనే పద్యములలో కూడా ఈ పని కష్టంగా కనపడ లేదు. ఎట్లంటే:—

1. "అమ్మా ఏడిపించెను న
న్నిమ్మాటలు పలికి అన్న" ఎప్పుడురాని
న్నమ్మ యశోద కనినదట?
అమ్మరి యసలెవరో నిన్ను నని యనుచుండున్.

2. ఇందుకు కోపమురాజా
అందరితో కలిసి యింక ఆటకుపోకా
నందయ్య తెలుపు, అమ్మయు;
ఎందుకురా నీవు నల్ల నిట్లనుచుండెన్.

3. పకపక నవ్వెరి అమ్మా
ఒకరొక చేచిటిక వేసి ఊరక గొల్లల్
'పికిరీలు' చేయుచు నుడుచుక్
ఇక అన్నయు వారినెల్ల సెవద్రోచవమా.

4. నన్నే ఎప్పుడు కొట్టుదు
వన్నయనిన నీకు నిష్టమాకే" యను నా
పెన్నుని కోపపు బలుకులు
విన్నదియై నవ్వుకొనుచు ప్రేలయిటులనున్.

5. "కన్నా, వినరా, బలరా
మన్న మొదటినుండి కట్టె అల్లరివాడే
నాన్నా, ఈ అవులతో
డన్నా! నేనమ్మ నీకు అసలు కొడుకన్.

ఇక ఈ గ్రాంధికీకరణంద్వారా పద్యాల్లో శిష్టవ్యావహారిక భాషాప్రయోగంలో ఒక్క రహస్యము గోచరమయింది. కంద పద్యములో మాత్రలు ప్రధానము. 4 మాత్రలు గల భ, జ, స, నల, గగ అనే గణములుమాత్రమే వాడాలి. అందుచే పై గ్రాంధికీకరణము సులభమయింది. ఇట్టిమార్పు చేయవలసిన అవసరం మాట అటుంచి, అట్టిమార్పులుచేసే స్వాతంత్ర్యం సామాన్యంగా ఉపయోగించే చంపకమాల, ఉత్పలమాల, శార్దూల మత్తేభ విక్రీడితములవిషయంలో అంత సులభం కాకపోవచ్చు. కనుక పద్య కావ్యాల్లో ఈ క్రిందిపద్ధతులను పాటించి, శిష్టవ్యావహారిక భాషను ప్రవేశపెట్టవచ్చునని తోస్తోంది!—

(1) కవికల్పితపాత్రోక్తులకు శిష్టవ్యావహారికభాష నుపయోగించడము.

(2) మాత్రాప్రాధాన్యము గల అంటే గణనియమము సడలింపు వీలిచ్చే (అంటే ఈ గణమే ఉండాలనే నియమములేని) తేటగీతి, ఆటవెలది, సీస కందములు మొదలయినవానినే సంభాషణపట్ల ఉపయోగించడము—

"పురాణ మిత్యేవ న సాధు సర్వం
న చాపి కావ్యం నవ మిత్యవద్యం"

అనే కవ్యుక్తిని స్మరిస్తూ, ఈ నాలుగు ముక్కలూ మనవి చేశాను—గద్యభాషకూ పద్యభాషకూ ఇతరత్ర ఎక్కడాలేని ఇంత అంతరం తెలుగుభాషలో తొలగించలేకపోయినా తగ్గించలేమా? ప్రాచీన కావ్యాల్లో క్వాచిత్కంగానూ, చాటువులలో ప్రచురంగానూ దొరలిన శిష్టవ్యావహారికభాషా ప్రయోగాలు పద్యరచనకేల ఉపయోగపడరాదు? ఈ విషయమై పెద్దలు ఆలోచించవలెనని ప్రార్థన. ఇది సాహిత్యరంగంలో సంచలనం కలిగించుగాక. సంచలనం కలిగిస్తేనే ఈ నావ్యాసపు టుద్దేశం ఫలవంతమని భావిస్తాను.



మా పోషకులకు, హితైషులకు ఎల్లరకును
నూతన సంవత్సరము సర్వ శుభప్రదమగుగాక!

మేము క్రొత్తగా నిర్మించిన పరావిష్కారం తెలుగు వ్రాత లిపి టైపులు తెలుగుభాషా సౌందర్యమునకు నిశ్చయముగ వన్నె తెచ్చుచున్నవి. మేము తెలుగు ప్రజలు గర్వింప గలుగునట్టి క్రొత్త టైపులను ఇంకను ప్రవేశపెట్టనున్నాము.

MANICKAM TELUGU ITALIC

24 Pt. **125 lbs.**

నెల్సన్ అండు కంపెనీ లోన ఈ
అక్షరములను ముద్దులొలుకునట్లు
తయారుచేయబడి యున్నవి

14 Pt. **125 lbs.**

పున్నమనాటి వెన్నెలను బోలిన కాంతుల నీవు దివ్వెలతో
స్వర్ణమయ తోరణాలుగ రచింపుడు రాత్రుల నృత్యోత్సవా
లున్న దినాలలోఁ బద్మరాగమయకాంతిని గాంచి భ్రాంతిమై
వెన్నెల పుట్టఁ బెంచు ఉపమయము నిహారము నాహరింపగన్

12 Pt. **125 lbs.**

ప్రతి సంవత్సర మాదియామినిని నాఁటయించి పండొమ్మిదం
విచిత్రాంతులతో నవరోజు నారంభించగు ప్రాచీనోత్సవోత్సవ సుస్తుయుల్
స్తుతియించం దగునందుఁ బొమ్మలవలె జక్కప్రసాదనాంచేర నాఁ
డనిపుత్రంబగు వస్తుజాలములు దేశాగ్రంత విఖ్యాతములతో
కుతుకంబొప్పంగ విక్రయింతురు పటుగృహాల సంఘాంగనల్

Design protected by Patent No. 74881.

10, 18, 36 & 48 Pt. can also be supplied.

NELSON & CO. THE FINE-ART TYPE FOUNDRY
CHOOLAI MADRAS-7



వైతరణి



శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

నాచికేతుడు : అమ్మా ! యమధర్మరాజుగా రింటిలో నున్నారా?

యమి : అయ్యా, ఎవరు మీరు?

నాచి : ఔద్దాలకియు, ఆరుణియు నగు వాజశ్రవసుని కుమారుడను.

యమి : అయ్యో బాబూ. ఇంత చిన్నపిల్లాడ వీ లోకమున కేల వచ్చితివి?

నాచి : మృత్యువునకు చిన్న పెద్ద లున్నట్లు!

యమి : అది యేమయ్యా! ఆరుణీ. నీ వగ్నిహోత్రమువలె వెలిగిపోవుచున్నావు. నీకు మృత్యు వెక్కడిది? నీ పేరేమి?

నాచి : నాచికేతుడు.

యమి : నాచికేతుడా? చిత్రగుప్తా, ఈయన యెవరో తెలిసినదా?

(నాచికేతుడా నాచికేతుడా? యని పది కంఠములు వినిపించును)

నాచి : అమ్మా, చెప్పలేదు. యమధర్మరాజుగా రింటిలో నున్నారా?

యమి : అయ్యా, తమరీ లోకమున కెందుకు వచ్చితిరి!

నాచి : నా తండ్రికి నామీద కోపము వచ్చి నన్ను మృత్యువునకు దానము చేసెను.

యమి : ఇది చిత్రముగా నున్నది. నీ తండ్రికి నీమీద కోప మెందుకు వచ్చెను.

నాచి : పీతోదకలు, జగ్ధతృణలు, దుగ్ధదోహలు, నిరింద్రియలైన గోవులను దానము చేసినవారు, అనందములను లోకములకు పోవుదురు. అట్టి లోకములనుండి నా తండ్రిని రక్షించుటకు నే నిచ్చుటకే వచ్చితిని.

యమి : అవా. అట్టి గోవులను దానము చేయుట కొడుకును చంపుట వంటిది. ఏమి పుత్ర హత్య !

నాచి : కాదమ్మా, నేనే యడిగితిని. నాయనగారూ! నన్నెవ్వరికి దానము చేయుదురని? మూడుమారు లడిగితిని. ఆయన నన్ను మృత్యువున కిచ్చెను.

(మృత్యువున కిచ్చెనా! మృత్యువున కిచ్చెనా! యని పది కంఠములు)

నాచి : అమ్మా, నాకు చెప్పలేదు, యమధర్మరాజుగా రింటిలో నున్నారా?

యమి : నీవు నాచికేతుడవు, అగ్నిమూర్తివి; నిన్ను నీ తండ్రి మృత్యువునకు దానము చేసినాడు. నీవు మృత్యువశంగతుడ వయితివి. యముడు నీ కెట్లు కన్పించును? యముని ధర్మరహస్య మంతయును నీవే. యముని తేజస్సంతయు, మహిమ యంతయు, మృత్యువశంగతమయినది. ఆయన నిస్తేజు డయినాడు.

నాచి : నేనొక ఋషిబాలకుడను, నేను మృత్యువునకు దత్తుడనగుటచేత యమునకు తేజోహాని యెట్లు జరుగును ? ఆయన యింటిలో లేడు కాబోలు నన్ను మీ రేలయించుచున్నారు.

యమి : ఋషి బాలకా ! నీ విచటికి వచ్చి మూన్నాళ్ళయినది. ఆతిథ్యము స్వీకరించవు. యముడు వచ్చి నన్నేమనునో? మూన్నాళ్ళు ఎవనియింట నతిథి నిరాహారిగా నుండునో వానిస్థితి యేమి చెప్పవలయును ? మొదటిదినమున గృహస్థునొక్క సంతానము నశించిపోవును. రెండవదినమున నతని పశుసంపద నశించిపోవును. మూడవదినమున నతని పుణ్యమంతయు నశించిపోవును.

నాచి : దానిపేరే మృత్యువు. సంతానము, సంపద, పుణ్యము ఈ మూటియొక్క కూడికయే భూలోకము యొక్కయు, స్వర్గలోకము యొక్కయు జీవియొక్కయు సంబంధము. ఇవి మూడు నశించి పోవుటయే మృత్యువు.

యమ : ఓయి నాచికేతా, నీవు మహాగ్నిమూర్తివి. నీకు కూడ మృత్యువున్నదా !

నా : నాకు మృత్యువెట్లున్నది ! మృత్యువు నందినకే యది కాదును. వానికి మృత్యువు, తద్భావమునకు మృత్యువు. తద్భావము లాశ్రయించి యున్న జీవభావముతో గూడియున్న శరీరమునకు మృత్యువు.

యమి : మృత్యువనినచో భయమగుచున్నది.

నా : భయమే మృత్యువు, మృత్యువే భయము.

యమ : అట్లనా ! మృత్యువనగా భయమా ?

(మృత్యువనగా భయమా ! యని పదిగొంతులు వినిపించును)

ఒకగొంతు :

ఉదయపర్వతముపై మూడుసార్లుగా నుదయించె నినుడు
కదలియస్తగిరీంద్ర గహ్వరమ్మునం గడువాలె నినుడు
కదలిన సూర్యతేజమ్ములోపల మిణుగురు లైన
కదిసి దక్షిణదిశా మహిమ కడమ దిక్కులయందు చేరె.

మరియొకగొంతు :

రవిగనూజుడు ధర్మరాజు రాజీవ నేత్రమ్ములందు
కవురు గప్పినయట్లు తేజమంతయు కాలాగ్ని క్రమ్మ
యవసథమ్మున వచ్చి యతిథి మూన్నాళ్ళన్నమ్ము లేక
వనసిపోవుట చేత పున్నె మంతయు నాశమైపోవ.

ఇంకొక గొంతు:

ఇది మహాప్రళయమ్మొ యేమొ? యెల్లసంతతియు
కడుపులో నావుల గుంపు బ్రతుకులకాచు పున్నెమ్ము
నదవదలైపోయె సృష్టి లేదాయె నద్దానిమూల
పదవి యే భంగమ్ము పడసె జీవునిబాట మూసికొనె.

యముడు: ఆ బ్రాహ్మణబాలుడెక్కడ? యెక్కడ?

యమి: మహారాజా, ఇక్కడిక్కడ.

యము: అయ్యా, నా యింట మూన్నాళ్ళు నీవు నిరాహారుడవైయున్నావు. అన్నము తినకుండ. నమస్కారార్హుడవయిన బ్రాహ్మణుడవు. మూడురాత్రులు నాయింట నున్నట్టి నీకు నమస్కారము. నాకు శుభమగుగాక. నా శుభమును గోరి నీవు మూడు వరములను కోరుము.

నాచి: యమధర్మరాజా. నా తండ్రియయిన గౌతముడు కోపము మారి సుమనస్కుడై శాంతసంకల్పుడై నాతో మాటాడుగాక.

యము: ఓ యయ్యా, నీ తండ్రి యౌద్దాలకి మృత్యు ముఖము నుండి వెలికి వచ్చిన నిన్ను నా యాజ్ఞచేత స్వీకరించుగాక. మరిం రెండవ వరము కోరుము.

నాచి: ఓయి మృత్యువా, ఇచ్చట భయము లేదు. ముసలితనము లేదు. ఆకలి దప్పులు లేవు. దుఃఖము లేదు. ఇట్టిలోకమునకు చేరు మంత్రము నా కుపదేశింపుము. ఏ యజ్ఞముచేత మృత్యువును గెలువవచ్చునో యా యజ్ఞమును, నా యగ్నిహోత్రమును నా కుపదేశింపుము.

యము: ఓయీ, నీ పేరేమి?

నాచి: నన్ను నాచికేతు డందురు.

యము: ఏమీ, యేమీ?

[నేపథ్యమున గీతము వినిపించును.]

ఎవడు పుష్పము నెరుగునో
పుష్పవంతుడు ప్రజావంతుడు తాను పశుమంతు
డును నగునో

చంద్రముడు జలమునకు పుష్పము
అని యెరింగినవాడు నిజముగ
పుష్పవంతుడు ప్రజావంతుడు తాను పశుమంతుడును
నగునో.

నీటి యాయతనమ్మెరింగిన
వాడు తా గృహమేధి యగును
నీటి యాయతనమ్ము నిప్పురా.
ఎరిగి తానాయతనియే యగును
అగ్ని యాయతన మ్మెఱింగిన నాయతని యగును
అగ్ని యాయతనమ్ము నీళులు ఆయతని యెరుగు
నీటియాయతనమ్ము వాయువు
వాయునాయతనమ్మెరింగిన యాయతనవంతుడగూ
వాయు నాయతనమ్ము నీళులు తెలిసినవాడు గృహమేధి
ఎవడు తపసును చేసి యాయతనమ్మెఱుంగునో
వాడు తానె యాయతనవంతు డగు
అతని యాయతనమ్ము నీరగు
అతడు గృహమేధి
పుష్పవంతుడు ప్రజావంతుడు తాను పశుమంతుడును
నగునో

యము: నాచికేతా, మహాగ్నిస్వరూపా, నీవు నా యింటికి వచ్చితివి. నీ ప్రశస్తి నా లోకములో పాడబడుచున్నది వినుచుంటివా?

(మరల వినిపించును)

యోపాం పుష్పం వేద
పుష్పవాన్ ప్రజావాన్ పశుమాన్భవతి

యము: ఓయి మహర్షి. నీవే నాచికేతాగ్నివి. పుష్ప మనగా సర్వ పుణ్యము, సర్వజ్ఞానము, వికృతా వికృత పరిణామభూతమైన సర్వజగత్తు. వివర్తమైన సర్వజగత్తు దానికి మూలభూతమైనది; యీ సర్వజగత్తు. ఈ పుష్ప మహిమచేతనే సర్వసృష్టి సాగుచున్నది. సర్వ జీవలోకము నడచుచున్నది. పుష్పము నెఱిగినవాడే పుష్పవంతుడు. వాడే ప్రజావంతుడు. వాడే పశుమంతుడు. ఈ పుష్పజ్ఞానము, ఓయి నాచికేతా. ఓయి వహ్నిరూపా నీ యుపాసనచేతనే తెలియును. నీవు పుష్పాకృతివి. ఆ మహాగ్నివి నీవే! నిన్ను ఉపాసించుటచేతనే నా లోకములు ధర్మలోకము లయినవి. నీవు మూన్నాళ్ళిక్కడ నుపవసించి పుష్పమును వాడునట్లు చేసితివి. నీకీ రెండు వరము లిచ్చి మరల నేను నిలువద్రొక్కుకొంటివి. ఈ పరిజ్ఞానమంతయు మృత్యువుయొక్క యాతలి రొమ్ము.

అమృతమయమ్ము కైరవసుమాప్తుని
మండల మద్ది వారి మూ
లము నది యెవ్వడో యెఱుగు
లాలిత చంపక మల్లికా జపా
సుమ బహుళాత్త గోనిచయ సూన
సమృద్ధిని గాంచు నీ స్వరూ
పము నెఱుగున్ జగచ్చలన
భావ విశారదుడా ఋషీశ్వరా.

నాచి: ఎవడు త్రిణాచికేతుడో వాడు మృత్యుపాశములను తెగనరికి దుఃఖాతీతుడై స్వర్గసుఖము ననుభవించును. ఓ యమ

ధర్మరాజా! ఇది నీ కృపావిశేషము. నాకీ రెండు వరము లిచ్చుటచే నీ ధర్మలోకము నిలిచినది. నా స్వరూప మవగతమైనది. ఉత్తర విషయము నా మూడవ వరము.

ఇటనుండి యేగి యెచ్చటికేగు మానవుడు
కొంద రున్నాడందురు కొందరు లేడందురు
ఉండెనంటకు హేతు వున్నదా యమరాజ!
లేడనుటచే నిజమ్మాడిరా యమరాజ!
ఈ సందియమ్మె మహీయమ్ము యమరాజ
ఈ సందియము తీర్పవే యమరాజ!

(పెద్దమ్రోత, గాలి, ఉరుములు)

ఒకగొంతు: చెలియలికట్టను దాటిపోయి
వలగొని గుట్టలు మోదిపోయి
జలధుల పొంగులు రేగిపోయి
వలభులకోభులు తూలిపోయె.

మరియొకగొంతు: గిరి మహాశిఖరముల్ కర్ణమ్ములై
ద్దరి వికస్వర శిలల్ చూర్ణమ్ములై
ప్రత్యంత గిరులెల్ల దీర్ణమ్ములై
గగన శకలమ్ములు ఘూర్ణమ్ములై

ఇంకొక: ప్రళయ వాయునమితి పరువెత్తిపరువెత్తి
విలయనాద రేఖ విసువెత్తి విసువెత్తి
చలనభావమెల్ల జళుకారి జళుకారి
కవిత బ్రహ్మభావములు గుడుసుళ్లయి

వేరొక: మేఘావర్తమ్ములు పుష్కలా
మోఘాంభోధర సంతతి
ఓఘమ్ములు వ్యూహమ్ములు
మేఘమ్ములు చెరియించున్.

యము: ఋషిబాలకా, యెంతప్రశ్న వేసితివి! ఇచట దేవతలకు కూడ సంశయమే. ఇది పరమ విచికిత్సితము. ఈ ధర్మ మణువు. ఇది చక్కగా చెప్పుటను తెలియదు. నీ వింకొక వర మడుగుము. నీవు నన్ను బలవంతపెట్టకు. నన్ను వదలిపెట్టుము.

(ఒక సన్నని గొంతు)

మల్లికాసుమ సౌరభ పేశలమంద
మారుతము వీతెంచెన్
హాల్లీనకముల గంగాజలముల
అంభోధరములు విహరించెన్
కల్లోలాగ్ర చలజ్జలనిధులవి
క్రమముగ నుపశాంతించెన్
విల్లీబాలనవారుణపత్ర ప్రభాపటలి
చిదిలించెన్ కాంతులు

నా: మృత్యుదేవా, ఈ పరమ రహస్యము నీవు కాక మరెవ్వరు చెప్పగలరు? మరి దేవతలే దీనియందు సందియం పడుదురు గదా? స్వామీ మరి యొక్కమాట. నేను నాచికేతాగ్నిని. నా యగ్ని స్వరూపము లోకమునందు నిలుపవలెనన్నచో నీ మహారహస్యమును నీవు చెప్పవలయును.

య: శతాయుష్కులను, పుత్రపౌత్రులను కోరుము. పశుసంపదను వాంఛించుము. ఏనుగుల నడుగుము. గుఱ్ఱముల నడుగుము. బంగారము నభిలషింపుము. ఈ సర్వభూమండలముయొక్క రాజ్యాధిపత్యమడుగుము. నీకొక్కనికి చావులేదు. వెళ్ళుము. వెళ్ళుము. దీని నడుగకుము.

నా: యమరాజా, నాకేవియును వలదు.

యము:

వీనియన్నింటితోడ సమానమైన
దో వరముగాని కోరుమోయీ కుమార
ఈ సమస్త ప్రపంచ పుష్పామృతా కృ
తి సమస్తమ్ము కానగదోయీ యిది విడి.

నా: నాకింకేమియు వలదు. తక్కినవన్నియు నీకే, నాకిదియే కావలయును.

యము:

మర్త్యలోకమున దుర్లభమైన కామములు
మరి యథేచ్ఛముగాగ నడుగవయ్య కుమార
కొదమ వెన్నెలతీగ మెదువైన మేను వెల
లారు కామినుల ముత్తములు కోరగదయ్య
అరదములు కోరుకొను మమృత సంగీతముల్
పవలు దివిటీలు పుష్ప మనోజ్ఞ మకుటముల్
ఇవి మనుష్యులకు సాధ్యములు కావేకదా!
అవి కోరుకొనుము మృత్యురహస్య మేమిటికి?

నా: ఓయి యమరాజా, ఇవి యన్నియు నాకు వలదు.

తాకిన గందిపోవు నమృత స్రవణమ్ములై
యైన పుష్పముల్
చేకొని నంత యౌవనము జీర్ణమగున్
లలితాంగు లందునన్
నాకము నంటుచున్నను ననంత మనోహర
భోగభాగ్యముల్
లేకువమాలి నిస్పృహను తెచ్చుతుదిన్
వెన విప్రియై చనున్.

ఓయి యమరాజా! లోకమున—అన్నాదులచేత కడుపు నిండును. తృప్తియగును. ధనముచేత కాదు. ధనము వచ్చినకొలది ధనతృష్ణ పెరుగును. పైగా నీవు రాజ్యముచేసి నన్నాళ్ళు మా యాయుర్దాయము. కనుక నేను కోరిన వరమే నాకు కావలయును.

ఒక గొంతు:

చిరిగిపోనిది చావులేనిది
సేవధింబలె నయిన దానిని
చిరిగిపోవుచు చావుపొందుచు
చెడినమానవు డెవడు కోరడు
మృత్యువున్న దటంచు తెలిసియు
మృత్యువున కెదురేగు నెవ్వడు
నృత్యసంగీతములు ధనములు
మృత్యుదేవత తీయు త్రోవలు.

మరియొక గొంతు:

సాంపరాయమ్మనగ మృత్యువు
చనిన పిమ్మట జీవితమ్మని
లింపులకు నయిన విచికిత్సాలీన
మధుమయమయిన మార్గము
దీని నచికేతుండు కోరును
దీని నచికేతుండు కోరును
దీని తెలిసినవానికే సమధీతమై
చను మృత్యుమర్మము.

యముడు: నచికేతా! నీవు మహాగ్ని రూపమవు, పూర్వమీమాంసా సమిష్టి రూపమవు. నీవీ మృత్యురహస్యము తెలిసికొన వాంఛింతువేని నా వెంట రమ్ము. నేను నీకు నరకలోకములు చూపింతును. ఆ త్రిజీవుల యనుభూతి విశేషముచేత నీకా యర్థము విస్పష్టమగును.

నాచి: యమరాజా, నన్ను నరకలోకములకు తీసుకొని పోయెదవా?

యము: ఓయీ, నరకలోకమునకు పోవుటకు భయమా, ఇది మృత్యువుయొక్క ప్రథమలక్షణము. శ్రేయస్సు ప్రేయస్సని రెండు పదార్థము లున్నవి. శ్రేయస్సు హితము, ప్రేయస్సు మనోహరి. శ్రేయస్సును పొంది పురుషుడు సన్మార్గమును పోవును. రెండవదానిని పొంది యసన్మార్గమున పోవును. రెండును బంధహేతువులు. నీవు దానిని పరిత్యజించితివి.

(విపరీతమైన రోదన ధ్వనులు)

యము: నచికేతా! ఇదొక జీవుడు. హఠయోగము నభ్యసించినవాడు. అల్పములైన శక్తులు గడించినవాని బలమున కామతృప్తి చేసుకొన్నవాడు.

నాచి: ఓయి జీవుడా! నీవెందులకు దుఃఖించుచున్నావు.

జీవుడు: నచికేతా, నిన్ను నే నెరుగుదునయ్యా. నేను తెలియక చేసితిని.

ఒక గొంతు:

అవిద్యలో పడి సువిద్య తెలియక
అవిద్య విద్యల కామడదూరము
అవిద్యలో పడగా నచికేతుడు
సువిద్య కందము చూచెడు మోక్షము
అంధుని చేకొని యంధుడు నడచెడు
మంథానము వలె గిరగిర తిరుగుచు
అంధులు మూర్ఖులు అజ్ఞానమ్మున
బంధుర చక్రభ్రమణము సేయుచు

యముడు: పసిపిల్లవానికి క్రీడావస్తువులే పరమార్థము లయినట్లు మూర్ఖులకు సంపదయే యున్నది. భార్యాపుత్రులే యున్నారు. లోకములోని సౌఖ్యమే యున్నది. ఇది మృత్యువుయొక్క ద్వితీయ దశ.

(మరల రోదన ధ్వని)

యము: ఇతడు మరియొక జీవుడు. వేదవేదాంగములన్నియు తెలిసినవాడు. కాని లోకమునందే బద్ధమైన దృష్టి కలవాడు.

నాచి: ఓయి జీవుడా, ఇట్లయితి వేమయ్యా?

జీవు: మహాగ్నీ, నమస్కారము. చదివినందువలన నేమి లాభము? చదివినది నా కర్థము కాలేదు.

ఒక గొంతు:

చదివిన లాభమేమి, యెద
సారము ముట్టక లోకమందు, నే
చదివితినంచు గొప్పకయి
సాగుచు దాన ధనార్జనా సమా
స్పదమగు బుద్ధితో చను
నసాధువు బుద్ధికి తెల్విగాని లో
నెద పరిపాక మందదు
గృహీత జగత్ బహుభోగ లబ్ధుడై.

మరియొక గొంతు:

సద్గురువు కావలయు సన్మూర్తి కావలయు
వ్యాగ్రతము దోషమ్ము నెలయించుటకునూ,
సద్గురువు దొరకు తన సంస్కార వశమునను
సత్క్రియావశమునను సంస్కార మెసగూ.

యము: నచికేతా! ఎప్పుడూ సత్క్రియల నాచరింపవలయును. సత్క్రియాచరణము చదువుకంటె గొప్పది. అకార్యములను చేయుట మృత్యువుయొక్క తృతీయ దశ.

(పెద్దకేకలు వినిపించును.)

నాచి: యమరాజా. ఆ కేక లేమి?

య: నాచికేతా, నాకు నవ్వు వచ్చుచున్నది. వారు కొందరు జీవులు నరకబాధ లనుభవించుచు వాదిమాడుచున్నారు. ఆత్మ లేదని, యున్నదని. జీవులున్నారని, లేరని. ఈశ్వరుడు కనిపించడు, కనుపించునని, యమయాతనలు పడుచున్నారు. బాధించుకొనుచున్నారు.

నా : అయ్యో అజ్ఞానము.

ఒకగొంతు :

అల్పునకు తెలియనిది
యతి రహస్య మ్మిది
ఎంత యోచించినను నిది
సుసంపూర్ణముగ తెలియనిది
యెవ్వరును తెలియ జెప్పగరాని
దతి సూక్ష్మ మ్మౌ
తర్క్యము సత్పదార్థమ్ము.
వాదనతో తేలదు
లో తెలియును తానంతట
సాధువైన గురువు దొరక
సాధువు శిష్యుడు లభింప.

య : నాచికేతా, నీవు సాధువైన శిష్యుడవు, నేను సాధువైన గురువును, ఈ సర్వసంపదలు వ్యర్థములని నాకు తెలియును. అయినను నాచికేతుడా, నిన్ను నే నుపాసించితిని, అందుచేత శాశ్వతుడ నయితిని, నీవు సాక్షాత్పునీతుడవు.

(గాలిలో మధుర సంగీతము వినిపించుచుండును.)

నా : యమరాజా, ఆ మధుర సంగీత మేమి ?

ఒక గొంతు :

కోరికలతుది చూచి
పార మెరిగి సమస్త
సారమ్ము తెలిసికొన
ధీరుడా నచికేతు
డౌర యుద్గాత

మననశీలముచేత, మదిహర్ష శోకములు
విదలించి కనుచూపు వెక్కసమ్మయినట్టి
పరమ రహస్యమ్ము పారమ్ము తెలిసికొన
ధీరుడౌనచికేతు డౌర యుద్గాతా.

య : నచికేతా ! ముక్తులై యోగులైన పరమహంస లాకాశ గోళమున వీణాతంత్రులమీద నిన్ను స్తోత్రము చేయుచున్నారయ్యా.

నచి : యమరాజా.

ధర్మము కంటె నధర్మము కంటెను
కార్యముకంటె నకార్యము కంటెను
భూతము కంటెను భవ్యము కంటెను
ఏది చూచెదవో నాకది చెప్పుము.

యము :

వేదములన్నియు వాదము లన్నియు
తపములు సర్వము, జపములు సర్వము
దేని చెప్పునో బ్రహ్మచర్య మది
సావధానుడై వినవయ్యా !

(ఓం అని పలుసార్లు దీర్ఘదీర్ఘముగా వినిపించును.
హా, ఉహా, హా, ఉ.)

య : ఓం అను నీ యక్షరమొక్కటియే బ్రహ్మ. ఇది ఉపాస్యము. బ్రహ్మపదార్థముయొక్క అక్షరాకృతి. అది ఆత్మ. నీవు నరకలోకమున నిందరను చూచితివి. వారందరును చనిపోయిన వారేనా. నీవే యడుగుము.

(మరల రోదనధ్వనులు)

నాచి : జీవులారా, మీరందరూ చనిపోయారా ? మృత్యువును పొందితిరా ?

జీవులు : మేము మృత్యువును పొందుటయేమి ? ఆ భూలోకమున బ్రతికియున్నప్పుడు మృత్యువునుగూర్చి భయపడితిమి. ఇప్పుడును మృత్యువునుగూర్చి భయపడుచున్నాము.

నాచి : మీరు మరణించియే కదా యిచటికి వచ్చితిరి. ఇచట గూడ మృత్యువున్నదా ?

జీవు : కాదయ్యా, మే మచ్చటను చచ్చిపోదుము. మరి యిచ్చటకో పోదుమనిపించుచున్నది.

నాచి : మరి మనుష్యలోకమున నున్నప్పుడు భయపడినట్లే యిచటను భయపడుచున్నారా ?

జీవు : అచ్చటను భయపడితిమి. అచ్చటను బాధపడితిమి. ఇచ్చటను భయపడుచున్నాము. ఇచ్చటను బాధపడుచున్నాము.

నాచి : ఇది విచిత్రముగా నున్నది.

యము : నాచికేతా, మరియొక విచిత్రమైనది చూపించెదను.

(మధురమైన సంగీతము)

యము : నాచికేతా, ఇది స్వర్గలోకము. ఇక్కడనున్న జీవులందరు సుఖమనుభవించుచున్నారు. సంగీతములు పాడుచున్నారు. వీరి నడుగుము.

నాచి : ఓయీ స్వర్గవాసులారా. మీరందరు సుఖపడుచున్నారా ?

ఒకడు : ఓయీ, సుఖపడుచున్నాము.

నా : మీరేమియు బాధపడుటలేదా ? భయపడుటలేదా ?

ఒకడు : ఎందుకు బాధపడుటలేదు ? రాక్షసులతో బాధపడుచున్నాము. ఎప్పుడో యీ మాభోగము సమాప్తమగునని భయపడుచున్నాము.

నా : మీకు చావులేదా ?

ఒకడు : అయ్యో, యెందుకు లేదు, మాభోగము సమాప్తమగు వనగా నది మరణమే.

య : తెలిసినదా, నాచికేతా, భూలోకవాసులును భయపడుచున్నారు. కట్టి దుఃఖమయమైన నరకలోకమును కదలిపోవలసి వచ్చునేమోయని యచటి జీవులు భయపడుచున్నారు. దేనినిగూర్చి పడుయదుచున్నారు ? మృత్యువునుగూర్చి భయపడుచున్నారు.

మృత్యువును గూర్చి భయపడుచున్నారు. మృత్యువనగా నేమి?

నా: యమరాజా, తెలిసినదయ్యా, భూలోకవాసులు మఱియొక చోటిని గూర్చి పోవుటను మృత్యువనుకొనుచున్నారు. అట్లే యితరలోకవాసులును. తామున్నచోటునుండి యింకొక చోటునకు పోవుట మృత్యువని తెలిసినది.

య: అదియే దుఃఖము. తన యూరు వదలిపెట్టి మరియొక యూరుపోవుటయే దుఃఖము. తానొక దుఃఖములోనుండి యింకొక దుఃఖములోనికి పోవుట, యింకొక దుఃఖము నీకు ఋజువు చేసెదను. ఇదిగో మరల నరకమునకు వచ్చినాము.

(రోదన ధ్వనులు)

య: జీవులారా, మిమ్ముందరను ఇచ్చటనుండి మరియొక చోటికి తీసుకొనిపోదును... అచట మీరు వేరుబాధ లనుభవింప వలయును. ఆ బాధలింతకంటె తక్కువ బాధలు.

(పదిగొంతుకలు) వద్దు వద్దు, మేమీ బాధలే యనుభవించు చుందుము, మాకివి యలవాటయిపోయినది. మరి క్రొత్తబాధ లెట్లుండునో మాకు తెలియదు.

య: చూచితివా? నచికేతా, ఎవరికీ మార్పు ఇష్టములేదు. మార్పునుగూర్చి భయపడుతున్నారు. దీనినే మృత్యువనుకొను చున్నారు. ఓయి జీవులారా, మిమ్ము మరల మనుష్యులుగా పుట్టించెదను.

పది: ఓయి యమధర్మరాజా మమ్మున్నచోట నుండనిమ్ము. మాకక్కర్లేదు.

య: చూచితివా? నచికేతా, ఏ లోకవాసులైన నిట్లే యుందురు, ఏ దేశవాసులయిన నిట్లేయుందురు.

నా: యమరాజా, వారినట్లే యుండనీయ రాదా?

యము: నే నుండనిచ్చుట యేమున్నది? ఈ లోకములు, ఈ దేశములు, ఈ పరిస్థితులు నిత్యచంచలములు. అవి యుండవు. ఉండుటయన్నది వేరే యున్నది.

నాచి: అది యేటువంటిది?

(ఓం అన్న ధ్వని వినిపించును)

యము: ఉత్తిష్ఠత. లెమ్ము.

(అర నిముసము వీణావాద్యము)

యము: జాగ్రత. మేల్కొనుము.

(అర నిముసము సంగీతము)

య: ప్రాప్యవరాన్ నిబోధత. సద్గురువుల నుపాసింపుము.

(అర నిముసము సంగీతము)

య:

క్షురస్యధారా నిశితా దురత్యయా
దుర్గం పథస్తత్కవయో వదంతి

తే. పదనుగల కత్తి వాదరవలె నిశితము
దాటరానిది నడువగా తగనిదైన
ఈ మహా మార్గమును సుకవీంద్రకోటి
'తత్త్వ'నుచు చెప్పెదర అట్టి సత్తుచిత్తు.

అది నిత్యమైన యునికి — ఈ సర్వ జీవరాసుల హృదయములయందు సత్తు చిత్తు నయిన ఆ తత్ ఉన్నది. అది యీ లోకములయందు దొరకదు. ఈ లోకములు చంచలములు. ఈ చంచలమయిన చోట నా యచంచలమయినదానిని వీరందరు కోరుచున్నారు. అదియే మృత్యువు. ఇదియే మృత్యురహస్యము. ఈ సంపదాదులు, ఈ జన్మలు, ఈ లోకములు ఇవి నిజములు కావని తెలిసికొనుటయే మృత్యువును గెలుచుట. ఇదియే మృత్యురహస్యము.

నాచి: యమధర్మరాజా, నీవు సద్గురువువు దొరికితివి. నేను నీకు సచ్ఛిష్యుడను దొరికితిని. నీవు నాకిచ్చిన మొదటివరము వృథా యయినది. నేనిపుడు తండ్రివద్దకు పోవక్కరలేదు.

య: నచికేతా, ఇంకను కొంచెము మిగిలియున్నది. అక్కడికి పోవుటయేమి? పోకపోవుట మేమి? ఇక్కడనుండి యక్కడకు వెళ్ళినట్లే. అక్కడకు వెళ్ళి యిక్కడ నుండినట్లే.

నచి: అవునయ్యా, వ్యావహారికదశ యెంత భ్రాంతి కల్పించుచున్నది.

ఓం. ఓం. ఓం.

(ఓంకార ధ్వని దీర్ఘముగా వినిపించును.)

సమాప్తి.

